క్లుప్తంగా

రెండు ఇసుక రీచ్‌ల ప్రారంభం



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్

పెనగలూరు : మండలంలోని కోమంతరాజపురం, నారాయణ నెల్లూరు గ్రామాల్లో ఇసుక రీచ్‌లను శనివారం రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రీచ్‌లకు రెండు వేరువేరు డంపులు ఉంటాయన్నారు. డంపుల వద్ద చెక్ పోస్ట్ వద్ద సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. డంపింగ్‌ల వద్ద పోలీసు బందోబస్తు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇంద్రాణి, ఎంపీడీఓ విజయరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రాజమ్మ, కేతాచక్రపాణి, ఇసుక కాంట్రాక్టర్లు విద్యాసాగర్ రెడ్డి, నరేష్ నాయుడు, ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం నిర్మాణాలపై జడ్జి అసంతృప్తి

రాయచోటి టౌన్ : కోర్టు భవన నిర్మాణాల పనులు నాసిరకంగా చేపట్టడం పట్ల జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి అసహనం వ్యక్తం చేశారు. 2014లో నిర్మించిన రాయచోటి పాత కోర్టు సముదాయంలోని అడిషనల్ ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్టును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014లో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం కురుస్తున్న తేలికపాటి వర్షాలకే ఊరుస్తుండటంపై మండిపడ్డారు. మోల్డింగ్ సమయంలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వలనే ఈ దుస్థితి వచ్చిందన్నారు. ఇది ఇలా ఉంటే మరో 20 సంవత్సరాలలో కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. దీని మరమ్మతులను రోడ్డు భవనాల శాఖ అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

రాయచోటి అర్బన్ : ఇటీవలి వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగానికి వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన రాయచోటిలో విలేకరులతో మాట్లాడారు. వర్షం కారణంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోని రైతులు బొప్పాయి, అరటి, తమలపాకు, టమాటా తదితర పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయారన్నారు. దెబ్బతిన్న పంటలను జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామంటూ హెచ్చరించారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థినులు

రాజంపేట : చిత్తూరు ఎస్‌వీఎస్ కళాశాలలో జరగనున్న దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయం కబడ్డీ మహిళ పోటీలకు అన్నమాచార్య యూనవర్సిటీకి చెందిన జి.మానస, కె.అకిలా రెడ్డిలు ఎంపికయ్యారు. శనివారం ఏయూ కార్యాలయంలో వీరిద్దరికి ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ నారాయణలు అభినందించారు. కార్యక్రమంలో డా.బి. నాగముని(శారీరక విద్యా విభాగం), సైఫుల్లా, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

సామూహిక చర్యలతోనే దోమల నివారణ



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

రాయచోటి అర్బన్ : సామూహిక చర్యలతోనే దోమల నివారణ సాధ్యమవుతుందని యండపల్లె పీహెచ్‌సీ వైద్యసిబ్బంది తెలిపారు. శనివారం రాయచోటి రూరల్ మండలం మాధవరం గ్రామం దిగువకంచరపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా వైద్యసిబ్బంది పర్యటించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులను పరీక్షించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్ఓ లలితకుమారి, మల్టీపర్పస్ హెల్త్‌సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డి, ఫ్యామిలీ డాక్టర్ పోగ్రాం కో–ఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, షహనాజ్, శ్రీవిద్య, రేణుక, గీతావాణి, గంగాదేవి పాల్గొన్నారు.

'యానిమేటర్‌ను కొనసాగించండి'

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలో వీఓఏగా పనిచేస్తున్న షేక్ షబానాను యానిమేటర్‌గా కొనసాగించాలని హైకోర్టు అనుకూల తీర్పు ఇచ్చినట్లు షబానా భర్త బాబ్జాన్ శనివారం విలేకరులకు తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లతో ఈ మధ్య కాలంలో ఆమెను యానిమేటర్‌గా తొలగించిన అధికారులు హైకోర్టు అనుకూల తీర్పుతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని షబానా కోరారు. ఈ మేరకు హైకోర్టు తీర్పు ఇచ్చిన ఉత్తర్వులు సంబంధిత వెలుగు శాఖ జిల్లా అధికారులకు జారీ చేసినట్లు తెలిపారు.

హాస్టళ్లు తనిఖీ చేసిన జడ్జి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ప్రభుత్వ బాలుర, బాలికల బీసీ హాస్టళ్లు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్, మంగంపేట మినీ గురుకులం తదితర హాస్టళ్లను కోడూరు సివిల్ కోర్టు జూనియర్ జడ్జి పీజే తేజ సాయి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బతుకు బండిని నడిపేలా..

నిత్యం లక్షలాది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చే ఆర్టీసీ యువతకు డ్రైవింగ్‌పై శిక్షణ ఇస్తూ తన బాధ్యతను మరింత పెంచుకుంది. రాజంపేట ఆర్టీసీలో నిరుద్యోగ యువతకు హెవీ డ్రైవింగ్‌పై శిక్షణనిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలోనూ ముందుంటోంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఇటు ఆర్టీసీలోనో అటు ప్రైవేటుగానో ఉపాధి పొందుతూ తమ జీవితాలను మెరుగుపరుచుకుంటున్నారు. రాజంపేట ఆర్టీసీ డిపోలో యువత హెవీ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్న దానిపై 'సాక్షి'కథనం



ఆర్టీసీ డ్రైవింగ్‌స్కూల్ విద్యార్థికి శిక్షణ ఇస్తున్న ఆర్టీసీ సీనియర్ డ్రైవర్

- యువతకు రాజంపేట ఆర్టీసీలో హెవీ డ్రైవింగ్‌పై శిక్షణ
- ఇప్పటికే 15 బ్యాచ్‌లు పూర్తి
- కోర్సు పూర్తయిన వారికి ఉపాధి అవకాశాలు
- మోటార్ ఫీల్డ్‌లో ఆర్టీసీ హెవీ లైసెన్స్‌కు డిమాండ్

రాజంపేట : మొన్నటి మొన్నటి వరకు డ్రైవింగ్ స్కూల్స్ ప్రైవేటుగా పెట్టుకొని వారి వద్ద శిక్షణ తీసుకుంటూ వచ్చారు. అయితే నాలుగేళ్ల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తగా పార్లమెంటు కేంద్రంలో ఆర్టీసీ నేతృత్వంలో హెవీ లైసెన్స్ కోసం డ్రైవింగ్ స్కూల్‌ను మంజూరు చేసింది. ఆ దిశగా ఇప్పుడు రాజంపేట డిపోలో డ్రైవింగ్ స్కూల్ 2020 జూలై 22న ఏర్పాటు చేశారు. ఈ స్కూల్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. ఈ స్కూల్‌లో జారీ చేసే హెవీ లైసెన్స్‌కు మోటార్ ఫీల్డ్‌లో డిమాండ్ ఉంది.

ఏపీ, మహారాష్ట్రాలలో..

కేంద్రం గ్రాంటుతో నేషనల్ బస్ రెజువనేషన్ అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలోని పార్లమెంట్ నియోజకవర్గం కేంద్రంలో హెవీ డ్రైవింగ్‌స్కూల్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకు నిధులు కూడా కేటాయించింది. ఇందు కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి, అందులో ట్రైనర్ దగ్గరుండి స్టీరింగ్, ట్రైనీ చేతిలో మరొక స్టీరింగ్ ఉంటుంది. బస్సు నడిపే విధానంలో నైపుణ్యంను తెలుసుకొనేలా జూమ్‌కార్ డ్రైవింగ్ నిర్వహిస్తున్నారు.

ట్రైనర్స్ సీనియర్ డ్రైవర్లు..

రాజంపేటలో ఇద్దరు సీనియర్ డ్రైవర్లను ట్రైనర్స్(నేర్పించేవారు)గా విధులు నిర్వర్తిస్తున్నారు. నిరంతరం వీరి పర్యవేక్షణలో ప్రాక్టికల్(ఆన్‌రోడ్), థియరీ కూడా ఉంటుంది. సేఫ్టీ డ్రైవింగే లక్ష్యంగా ఈ శిక్షణ కొనసాగుతుంది. ట్రైనర్స్‌గా ఆండ్రూస్, ఎస్.బాషాలు స్కూల్‌లో యువ డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నారు. ప్రయాణికుల భద్రత, సమర్థత, సమయస్ఫూర్తి, ఇంధనపొదుపు తదితర అంశాలలో శిక్షణనిస్తూ పూర్తిస్థాయి డ్రైవర్లుగా తీర్చిదిద్దేలా చేస్తున్నారు.

బస్ ఆపరేటర్లగా అవకాశాలు..

శిక్షణా కేంద్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 15 బ్యాచ్‌లకు శిక్షణవ్వగా ప్రతి బ్యాచ్‌లో 16 మందిని ఎంపిక చేస్తారు. మొత్తం ట్రైనింగ్ రూ.26వేలుగా ఫీజు తీసుకోనున్నారు. ఇందులో ఎంపికవారికి హెవీ డ్రైవింగ్‌లో ఉత్తమశిక్షణ కల్పించి యువత ఉపాధి కోసం అవకాశాలను కల్పించడంలో ఆర్టీసీ విజయవంతమైంది. వీరందరికి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ సరిఫికెట్‌ను జారీ చేస్తుంది. బ్యాచ్‌లో శిక్షణ పూర్తయిన వారికి ఆర్టీసీలో చేరడానికి కడపలో జరిగే డ్రైవింగ్ టెస్ట్ పూర్తి చేయాలి. అక్కడ ఎంపికైనవారిని ఆర్టీసీ సంస్థలో అవసరాన్ని తగ్గట్టుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఎంపిక చేస్తున్నారు. దీనితో ఆర్టీసీలో డ్రైవర్ల కొరత కొంతమేర తగ్గినట్లైంది.

ఆర్టీసీలో డ్రైవర్లుగా అవకాశాలు



ఆర్టీసీలో డ్రైవింగ్ స్కూల్‌లో లైసెన్స్ కలిగిన వారికి డ్రైవర్‌గా ఎంపిక చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఉపాధి మార్గాన్ని చూపిస్తున్నాం. అద్దె బస్సులకు కూడా వీరికే ప్రాధాన్యత ఉంటుంది. డిపోలో నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన స్కూల్ నుంచి 200 మంది హెవీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఆర్టీసీ అందిస్తున్న ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి.

-గుండాల రమణయ్య, డిపో మేనేజరు, రాజంపేట

హెవీ లైసెన్స్ కోసం స్కూల్‌లో శిక్షణ తీసుకుంటున్నా



హెవీ లైసెన్స్ కోసం ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో 16వ బ్యాచ్‌లో చేరాను. డ్రైవింగ్‌లో నైపుణ్యాన్ని నేర్పుతున్నారు. సెఫ్టీ డ్రైవింగ్‌లో ఇస్తున్న శిక్షణ భవిష్యత్తులో ఎంతగానో దోహదపడుతుంది. డ్రైవింగ్ స్కూల్ బస్సులో తాము శిక్షణ పొందుతుంటే ఇక హెవీ లైసెన్స్ డ్రైవర్ల అనుభూతి కలుగుతోంది.

- ఈశ్వరయ్య, రాజంపేట

ఉపాధి లభిస్తోంది



ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ లైసెన్స్ కోసం శిక్షణ పొందాను. ఆర్టీసీ డ్రైవర్లు తమకు డ్రైవింగ్‌లో మెళకవులు నేర్పారు. ఫలితంగా ఇప్పుడు హెవీ డ్రైవర్‌గా పని చేసుకునే అవకాశం లభించింది. తనతో పాటు చాలా మంది ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో డ్రైవర్లగా పనిచేస్తున్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఆర్టీసీ హెవీలైసెన్స్ సర్టిఫికెట్‌కు మోటర్‌ఫీల్డ్‌లో విలువు ఉంది.

- కె.మల్లికార్జున, రాజంపేట

వన్ స్టాప్ సెంటర్ తనిఖీ



వన్ స్టాప్ సెంటర్‌ను పరిశీలిస్తున్న న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి

రాయచోటి టౌన్ : వన్ స్టాప్ సెంటర్‌ను అన్నమయ్య జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి, మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ కృష్ణన్‌కుట్టి తనిఖీ చేశారు. శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు, గృహహింసలు, బాల్యవివాహాలు, అక్రమ సంబంధాలు వంటి సమస్యలను పరిష్కరించేందుకు (సఖీ) వన్ స్టాప్ సెంటర్ ఒక వేదిక అవుతుందని చెప్పారు. దీని నిర్వహించే నిర్వహకులు ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. వన్‌స్టాప్ సెంటర్‌ను త్వరలో రాయచోటి ఏరియా ఆస్పత్రిలోకి మార్చే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ వినోద్, వన్ స్టాప్ నిర్వాహకులు ప్రభావతి, లీగల్ సర్వీస్ చంద్రకళ పాల్గొన్నారు.

నిఘా మరింత పెంచుతాం

ఒంటిమిట్ట : మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు నిఘా మరింత పెంచుతామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పరసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో పోలీసుల నిఘా పెంచుతామని, భద్రత కరువైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను అమర్చుతామన్నారు. అలాగే అల్లరి మూకల ఆటలు కట్టిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

వీరబల్లి : ప్రజల సమస్యలను తీర్చడమే పంచాయతీ పాలకవర్గ ధ్యేయమని ఉమ్మడి జిల్లాల జెడ్పీ డిప్యూటీ సీఈఓ పి.మైథిలి తెలిపారు. శనివారం ఆమె వీరబల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉప సర్పంచ్, వార్డు మెంబర్ల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శిక్షణా తరగతులలో నేర్చుకున్న విషయాలను క్షుణ్ణంగా గమనించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను తీర్చాలన్నారు. ప్రభుత్వం నుండి వస్తున్న నిధులతో ప్రజలకు అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఇష్టానుసారంగా పనులు చేసినట్లయితే ఆ పనులకు బిల్లులు రావు అన్నారు. పలువురు సర్పంచ్‌లు పంచాయతీలలో ఏర్పడిన నిధులపై కొరత, పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమెను ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, గ్రామ కార్యదర్శిలు, సర్పంచులు ఉపసర్పంచ్లు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



వీరబల్లి: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ

రామాపురం : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం 13 గ్రామాల పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులను నిర్వహించినట్లు ఎంపీడీఓ జాషువ పేర్కొన్నారు. సమావేశంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షభావ పరిస్థితుల్లో గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పట్నాయక్, ఏఓ చాన్‌బాషా, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణతో డిస్లెక్సియాను అధిగమిద్దాం

రాయచోటి (జగదాంబసెంటర్) : పట్టణంలోని భవితా కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో డిస్లెక్సియాపై శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సైరాబాను మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యసనకు సంబంధించిన లోపాలు ఉంటాయన్నారు. ఆ వైకల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు త్రిలోక్, జనార్దన్, సీజీవీ రాధ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : అవగాహన పెంచడం, సహాయక పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా డిస్లెక్సియాను అధికమించి విద్యార్థుల్లో సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేయవచ్చని ఎంఈఓ–2 వేల్పుల శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు డిస్లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటచలపతి, ఐఈఆర్‌పీ వి.ఖలందర్, కృష్ణవేణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రాయచోటి(జగదాంబ సెంటర్) : అవగాహనా ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థులు ర్యాలీ

సంబేపల్లె : భవిత కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై (డిస్లెక్సియాపై) అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించారు.




చిట్వేలి: ర్యాలీ తీస్తున్న అధికారులు, విద్యార్థులు

ప్రభుత్వ సేవను సద్వినియోగం చేసుకోవాలి

చిట్వేలి : నిర్దిష్టమైన అభ్యసన వైకల్యాలు ఉన్న పిల్లలందరికీ ప్రభుత్వం కల్పిస్తున్న అన్నిరకాల మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్యలు అన్నారు. శనివారం స్థానిక భవిత కేంద్రంలో డిస్లెక్సియా మాసోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులు విజయకుమారి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలందరికీ ప్రభుత్వం నుండి వస్తున్న అలవెన్సులు, ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేద్దాం

రామాపురం : హైదరాబాద్, విజయవాడలో జరిగే పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న పేర్కొన్నారు. శనివారం మండల పరిధి గువ్వలచెరువు గ్రామంలోని శ్రీ బాలాజీ విద్యానికేతన్‌లో ఆ సంఘం స్వర్ణోత్సవ సభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 78 సంవత్సరాల స్వాతంత్ర భారతదేశంలో పేదలకు ఉచిత నాణ్యమైన కామన్ విద్యా విధానాన్ని అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు విద్యారంగం పూర్తిగా వ్యాపారమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 50 ఏళ్ల నుండి విద్యారంగ సమస్యల పరిష్కారం, విద్యార్థుల హక్కులు రక్షణ, శాస్త్రీయ విద్య, సమసమాజ స్థాపనే ధ్యేయంగా పీడీఎస్‌యూ ఉద్యమించిందన్నారు. ఈనెల 24న హైదరాబాదులో, నవంబర్ 2న విజయవాడలో జరిగే సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ బాలాజీ విద్యానికేతన్ కరస్పాండెంట్ రెహమా, ప్రధానోపాధ్యాయులు దర్బార్ షావలి, పీడీఎస్‌యూ నాయులు, కృష్ణమూర్తి, సుబ్బయ్య, సుకన్య, కృష్ణకుమారి, షబ్బీర్ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేసిన అంకన్న

సచివాలయం తనిఖీ చేసిన వైఎస్సార్ జిల్లా డీపీఓ రాజ్యలక్ష్మి

సిద్దవటం : చెత్త సంపద తయారీ కేంద్రాల వద్ద మొక్కలు నాటాలని గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించామని డీపీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని టక్కోలు గ్రామ సచివాలయాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీఓ పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ గ్రామసచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. కావాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే అట్టి వారిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. గ్రామ సచివాలయ పరిధిలో విద్యుద్దీపాల సమస్య లేకుండా చూడాలని, ఇంటిపన్నులు సకాలంలో గ్రామ ప్రజలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శివయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో శనివారం జరిగిన గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల శిక్షణా కార్యక్రమాన్ని డీపీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాట్లాడుతూ సొంత ఆదాయ వనరులపై దృష్టి సారించి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలన్నారు.

మునగాకు వల్ల అనేక ప్రయోజనాలు

చిన్నమండెం : ప్రకృతి ప్రసాదమైన మునగాకు వ్యాధులను నివారించే శక్తి ఎక్కువగా ఉంటుందని ఏసీడీపీఓ సుగుణ తెలిపారు. శనివారం మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో సీబీ ఈవెంట్స్ కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవగుడిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏసీడీపీఓ పాల్గొని మునగాకు వలన కలిగే ప్రయోజనాలు, వివిధ రకాల ఆహార పదార్థాలు రొట్టెలు, కర్రీ, పొడర్ గురించి వివరించారు.

ప్రకృతి వరం మునగ చెట్టు

చిట్వేలి : అత్యంత పోషక విలువలు కలిగి ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న మునగ కాయలను ప్రతి ఒక్కరూ విధిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం చిట్వేలి ప్రాజెక్టులోని 144 అంగన్‌వాడీ కేంద్రంలోని మిట్టపల్లి హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వేడుక కార్యక్రమంలో సీడీపీఓ రాజేశ్వరి పాల్గొని మునగాకు వంటకాలను చేసి ప్రదర్శించి తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వసుందరమ్మ, సురేఖరాణి, విజయకుమారి, విశాలాక్షి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మంచిది

రామాపురం : గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో మునగాకు తీసుకోవాలని లక్కిరెడ్డిపల్లె సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. శనివారం మండల పరిధి గువ్వలచెరువు సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, మహిళలకు ఆరోగ్యం, ఆహారం, పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హుస్సేనమ్మ, పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.



చిన్నమండెం: అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ సుగుణ

అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక వేడుక

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని చింతలకుంటవాండ్లపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో సామాజిక వేడుక జరిగింది. ఈ సామాజిక వేడుకలో గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు. ఇందులో మునగాకు ప్రాముఖ్యతను వివరించారు. మునగాకులో విటమిన్ ఏ, విటమిన్ సి, కెరోటిన్ సమృద్ధిగా ఉంటుందన్నారు. మునగాకు తినడం వలన పలు వ్యాధులు దూరమవుతాయన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

నందలూరు : రాష్ట్రస్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలకు పాటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప స్పోర్ట్స్ స్కూల్‌లో శుక్రవారం జరిగినటువంటి ఉమ్మడి కడప జిల్లాల 10 నియోజకవర్గాలకు సంబంధించిన బాలీబాల్ జట్లు ఈ పోటీలలో పాల్గొనగా పాటూరు జెడ్పీ విద్యార్థినీ సి.సంధ్యారాణి అద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అయ్యిందన్నారు. అలాగే మరో విద్యార్థిని బి.నక్షత్ర స్టాండ్ బై ప్లేయర్‌గా ఎంపిక కాబడిందన్నారు. వీరి ఎంపికకు కృషి చేసిన శిక్షకులు ఫిజికల్ డైరెక్టర్ సుష్మిత, పీఈటీ జగన్‌లను అభినందించారు.

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని దివ్యతేజ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వెంకట సాయి అనే విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వరావు తెలిపారు. ఈ విద్యార్థి ఈ నెల 18వ తేదీ జిల్లా స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 21వ తేదీ హిందూపూర్‌లో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించాలి

సిద్దవటం : ఎన్నో ప్రయోజనాలు ఉన్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రతి రైతు అవలంబించాలని బద్వేల్ సహాయ వ్యవసాయా సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె రైతు సేవాకేంద్రం గ్రామ సమాఖ్య-2లోని రైతు నారపురెడ్డి మల్లికార్జునరెడ్డి మిరప తోటలో శనివారం ద్రవ జీవామృతంను తయారు చేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సహాయకులు టి.లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జ్యోతి, చిన్నక్క, ఐసీఆర్‌పీలు లక్ష్మిదేవి, వరలక్ష్మి, చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడి

రామాపురం : రైతులు పంటలను సాగు చేసేటప్పుడు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి సూచించారు. శనివారం పొలంబడిలో భాగంగా మండలంలోని గోపగుడిపల్లె గ్రామంలో వేరుశనగసాగులో రైతు పద్ధతికి, సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించిన పొలానికి మధ్య దిగుబడిలో వ్యత్యాసాలను గమనించారు. మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించిన పొలంలో అధిక దిగుబడి వచ్చిందన్నారు. సమగ్ర పోషక, ఎరువుల, పురుగు, తెగుళ్ల యాజమాన్యం చేయడం ద్వారా అధిక దిగుబడికి దోహదమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం కడప నుండి శాస్త్రవేత్తలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో అన్ని వసతులు కల్పించాలి

ఓబులవారిపల్లె : ఆశ్రమాలలో వృద్ధులకు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి పీజే తేజసాయి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆశ్రమాలు, సంజీవపురం గురుకుల పాఠశాలలను ఆయన పరిశీలించి మాట్లాడారు. జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమంలో ఆయన వృద్ధులు, దివ్యాంగులతో మాట్లాడారు. వారి ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు తదితర అంశాల గురించి ఆరా తీశారు. ఆశ్రమ నిర్వాహకులు పాణ్యం సుబ్రహ్మణ్యంతో మాట్లాడుతూ ఆశ్రమంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అండగా ఉంటామని తెలిపారు. అనంతరం చిన్మయారణ్యం ఆశ్రమం గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మెట్రీ, మరుగుదొడ్లు పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికాహారం, వైద్య సేవలు అదే విధంగా చర్యలు తీసుకోవాలని మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.



జీవనజ్యోతి ఆశ్రమాన్ని పరిశీలిస్తున్న జడ్జి సాయి

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో ఎంపీడీఓ సోమశేఖర్ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2023 - 2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన రూ.6.63 కోట్ల విలువైన పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పనుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పుడు పనులు అప్పుడే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శివశంకర్, ఎస్ఆర్‌పీ కన్నారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఎక్కువగా ఉందని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించి టీచర్ల కొరతను తీర్చాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఇచ్చిన దశలవారీ పోరాటంలో భాగంగా శనివారం ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని యాజమాన్య పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి కాని మున్సిపల్ పాఠశాలల్లో కాలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లకు హెచ్‌ఎం, అర్బన్ ఎంఈఓలుగా ప్రమోషన్‌లు కల్పించాలంటూ కోరారు. వెంటనే సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈనెల 24వ తేదీన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు సుధాకర్‌నాయుడు, శివారెడ్డి, హేమలత, చంద్రశేఖర్, వెంకటసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, వెంకటరమణ, దావుద్దీన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైన్ షాపును మరోప్రాంతానికి మార్చండి

పుల్లంపేట : మండల పరిధిలో లక్కీ వైన్స్ బ్రాందీ షాపును వెంటనే తొలగించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ మండల కార్యదర్శి రాజబోయిన సెల్వన్ కుమార్ ఆధ్వర్యంలో ఏఐవైఎఫ్, మహిళల సంఘాల నాయకులు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నేత జ్యోతి చిన్నయ్య, మహిళా నాయకులు సరోజనమ్మ మాట్లాడారు. మండల పరిధిలో ఎస్‌బీవీడీ సభా హైస్కూల్ దగ్గర 85 మీటర్లు దూరంలో లక్కీ వైన్స్ బ్రాందీ షాపును పెట్టారన్నారు. సెంటర్‌లో వైన్ షాప్ పెట్టడంలో వివిధ పనుల మీద ఈ మార్గంగుండా వెళ్లే విద్యార్థులు, చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడతారన్నారు. అధికారులు స్పందించి వైన్ షాపు మరో ప్రాంతానికి తరలించాలని తెలియజేశారు. ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి శెట్టిపల్లి పెంచలయ్య, మహిళా నాయకురాలు దుర్గ పాల్గొన్నారు.

పురస్కారాల వేడుకకు ఆహ్వానం

రాజంపేట : అఖిలభారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అవేర్నస్ సొసైటీ, అర్పిత సాహిత్య, సాంస్కృతిక సేవాసంస్థల ఆధ్వర్యంలో ఈనెల 21న విజయవాడలో నిర్వహించే ఆత్మీయ పురస్కారాల ప్రధానోత్సవ సభకు రాజంపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్‌ను గెస్ట్ ఆఫ్ హానర్‌గా ఆహ్వానించారు.

అక్రమ రవాణాను అరికడదాం

సుండుపల్లె : బాలల అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యత అని జిల్లా బాలల సంరక్షణ అధికారి వినోద్ కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని జికె రాచపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో దిమూమెంట్ ఫౌండేషన్ సంస్థ వారి సహకారంతో గుడ్ నైబర్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, బాలల సంరక్షణ గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.